బాధ్యతలు స్వీకరించిన టీఎస్‌ఎఫ్‌డీ చైర్మన్ వీరయ్య



వీరయ్యను అభినందిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హాజరైన మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు

గచ్చిబౌలి: తెలంగాణ స్టేట్ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం కొండాపూర్‌లోని బొటానికల్ గార్డెన్‌లో టీఎస్‌ఎఫ్‌డీసీ ఎండి. వైస్ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి ఆయనతో సంతకాలు చేయించి బాధ్యతలు అప్పగించారు. అనంతరం మంత్రులతో కలిసి మొక్కలు నాటారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, జారే ఆదినారాయణ రావు, డాక్టర్ తెల్లం వెంకట్రావు, రాందాస్ నాయక్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీ నారాయణ, గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వర్‌రావు, ట్రైకార్ చైర్మన్ డాక్టర్ బెల్లయ్య నాయక్, హస్త కళల చైర్మన్ నాయుడు సత్యం, టీఎస్‌ఎఫ్‌డీసీ టూరిజం ఈడీ రంజిత్ నాయక్ పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో ఫ్రెషర్స్‌డే



ఫ్యాషన్‌షోలో చిన్నారులతో ఉపాధ్యాయులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): విద్యార్థులు కష్టపడి చదివి అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని తెలంగాణ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రాంప్రసాద్ అన్నారు. శుక్రవారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెల ప్రభుత్వ తెలంగాణ మోడల్ స్కూల్‌లో ఫ్రెషర్స్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచే లక్ష్యంను నిర్దేశించుకోవాలన్నారు. అనంతరం 6వతరగతి విద్యార్థులకు ఫ్యాషన్‌షో, క్రీడాపోటీలు నిర్వహించారు. ఇంటర్మీయట్ రెండో సంవత్సరం విద్యార్థులు మొదటి సంవత్సరం విద్యార్థులకు విందు ఇచ్చారు.

దోమల మందు పిచికారీ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): దోమల నివారణకు జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని రామచంద్రాపురం డివిజన్ కార్పొరేటర్ పుష్పనగేష్ తెలిపారు. శుక్రవారం రామచంద్రాపురం పట్టణంలోని జిల్లాపరిషత్ పాఠశాలలో నిర్వహించిన దోమల నివారణ అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో దోమల మందు పిచికారీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి ఆదివారం ఉదయం 10గంటల 10నిమిషాలకు ఇంటి పరిసరాలను శుభ్రం చేసుకోవాలని కోరారు.



గుర్రపుడెక్క తొలగింపు పనుల్లో వేగం పెంచాలి



గుర్రపు డెక్క తొలగింపు పనులను పరిశీలిస్తున్న డీసీ రజనీకాంత్‌రెడ్డి తదితరులు

డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి

శేరిలింగంపల్లి: చాకలి చెరువులో గుర్రపుడెక్క తొలగింపు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని శేరిలింగంపల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి సూచించారు. శుక్రవారం లింగంపల్లి చాకలి చెరువులో ఫ్లోటింగ్ ట్రాక్ కలెక్టర్ (ఎఫ్‌టీసీ)తో గుర్రపుడెక్క తొలగింపు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రజనీకాంత్ రెడ్డి మాట్లాడుతూ వ్యాధులు వ్యాప్తి చెందకుండా దోమల నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. తొలగించిన గుర్రపు డెక్క వ్యర్థాలపై ఏసీఎం పౌడర్‌ను స్ప్రే చేయాలన్నారు. అనంతరం చెరువులో లార్వాను తుదముట్టించేందుకు ఆయిల్ బాల్స్‌ను వదిలారు. కార్యక్రమంలో సర్కిల్ ఉప వైద్యాధికారి నగేష్ నాయక్, అసిస్టెంట్ ఎంటమాలజిస్ట్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్వెస్టిట్యూర్ వేడుక

శేరిలింగంపల్లి: విద్యార్థుల నైపుణ్యాభివృద్ధితో పాటు నాయకత్వ లక్షణాలు పెంపొందించడంలో ఎపిస్టెమో వికాస్ లీడర్‌షిప్ స్కూల్ ముందుంటుందని ప్రిన్సిపాల్ పద్మ కొల్లి తెలిపారు.శుక్రవారం నల్లగండ్ల హుడా కాలనీలోని ఎపిస్టెమో వికాస్ లీడర్‌షిప్ స్కూల్ ఇన్వెస్టిట్యూర్ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నవోదయ విద్యాలయ సమితి డిప్యూటీ కమిషనర్ టి.గోపాలకృష్ణతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిల్ హెడ్ గర్ల్‌గా హర్షిత, హెడ్ బాయ్‌గా సాయి అఖిల్ కల్లూరి, డిప్యూటీ హెడ్ గర్ల్‌గా అనర్ఘ్య సాయి వంశిక, డిప్యూటీ హెడ్ బాయ్‌గా రోహన్ మొహంతిలను నియమించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం మార్చ్ ఫాస్ట్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వాణి, పూర్వ విద్యార్థి తన్మయి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

ఫ్రైడేను డ్రై డేగా పాటించాలి

రాయదుర్గం: దోమల నివారణకు ఫ్రైడే ను డ్రై డేగా పాటించాలని జీహెచ్‌ఎంసీ శేరిలింగంపల్లి సర్కిల్ ఎంటమాలజీ విభాగం అసిస్టెంట్ ఎంటమాలజిస్ట్ సీహెచ్ కిరణ్‌కుమార్‌రెడ్డి సూచించారు. ఎంటమాలజీ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం గోపన్‌పల్లిలోని జవహర్ నవోదయ విద్యాలయ, మధురానగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఖాజాగూడలోని జెడ్పీహెచ్‌ఎస్, అంజయ్యనగర్‌లోని జెడ్పీహెచ్‌ఎస్, సిద్దిఖ్‌నగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వారం ఒకరోజు ఇంటిని, పరిసరాలను శుభ్రం చేసుకోవాలని తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. ఇంట్లోని నీరు నిల్వ ఉంచే డ్రమ్ములు,తొట్టిలు ఖాళీ చేసి తాజా నీటితో నింపాలని సూచించారు.కొబ్బరిబొండాలు, టైర్లు తదితరాల్లో నీరు నిల్వ ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎంటమాలజీ సిబ్బంది

నేడు ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ స్నాతకోత్సవం



ట్రిపుల్‌ఐటీ ప్రధాన ద్వారం

రాయదుర్గం: గచ్చిబౌలిలోని ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ 23వ స్నాతకోత్సవం శనివారం(నేడు) జరగనుంది. ట్రిపుల్‌ఐటీ విద్య, పరిశోధనా రంగాలలో నిష్ణాతులను తయారు చేయడమే కాకుండా నూతన ఆవిష్కరణలకు ప్రోత్సాహం అందిస్తూ టాప్ టెన్‌లో నిలిచింది. యూజీసీ గుర్తింపు, ఏఐసీటీఈ ఆమోదం పొందిన, న్యాక్ (గ్రేడ్-ఏ) గుర్తింపు పొందింది. ప్రతియేటా దాదాపు 100 శాతం ప్లేస్‌మెంట్స్ కల్పిస్తోంది. ప్రస్తుతం 2024లో ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ క్యూఎస్‌డబ్ల్యూఆర్ ర్యాంకింగ్ ప్రకారం గ్లోబల్‌గా 501–550లో ఉంది.

గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో నిర్వహణ

- ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ 23వ స్నాతకోత్సవాన్ని శనివారం మధ్యాహ్నం 2 గంటలకు గచ్చిబౌలిలోని గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో నిర్వహిస్తారు.
- ఈ కార్యక్రమానికి డీఎస్ఐఆర్ సెక్రెటరీ, సీఎస్ఐఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ కలైసెల్వి ముఖ్యఅతిథిగా పాల్గొంటారు.

స్నాతకోత్సవానికి ప్రత్యేక డ్రెస్ కోడ్.

- నగరంలో ఉన్నత విద్యా సంస్థలలో స్నాతకోత్సవానికి ప్రత్యేక డ్రెస్ కోడ్‌ను అమలు చేసిన మొదటి విద్యాసంస్థగా గుర్తింపు పొందింది.
- స్నాతకోత్సవంలో మంగళగిరికి చెందిన చేనేత లేత తెలుపు రంగు లేదా లేత క్రీమ్ కలర్‌తో కూడిన దుస్తులు ధరించాలనేది నిబంధన 2009లో విధించారు.
- ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు కుర్తా, పైజమా లేదా ధోతితో పాటు పైన కండువా ధరించాలి. విద్యార్థినులు చీర లేదా సల్వార్ కమీజ్‌ను ధరించాలనే నిబంధనను ఖచ్చితం అమలు చేస్తున్నారు.
- ఈ కార్యక్రమానికి హాజరయ్యే ట్రిపుల్‌ఐటీ గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్, డైరెక్టర్, రిజిస్ట్రార్, ప్రొఫెసర్లు కూడా వీటినే ధరించడం విశేషం.కాగా ముఖ్యఅతిథులు కూడా ఈ డ్రెస్‌ను ధరించి వస్తారు.

ట్రిపుల్‌ఐటీ ప్రత్యేకతలు

- ఆర్ అండ్ డీ షోకేస్.. ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ క్యాంపస్‌లో ప్రతియేటా రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ షోకేస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. విద్యార్థుల నూతన ఆవిష్కరణలు, పోస్టర్లు, ఇతర అంశాలను ప్రదర్శించడం, నిష్ణాతులతో ఉపన్యాసాలు నిర్వహిస్తారు.
- ఫెలిసిటీ... ఈ క్యాంపస్‌లో మరో ప్రత్యేకత ఫెలిసిటీ కార్యక్రమం. దీన్ని పూర్తిగా విద్యార్థులే రూపొందించి మూడు రోజులపాటు సందడిగా నిర్వహిస్తారు. దీన్ని టెక్నికల్, కల్చరల్ ఫెస్ట్‌గా పిలుస్తారు.
- సీఐఈ.... ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో సీఐఈ టెక్నాలజీ ఇంక్యుబేటర్ అత్యధిక గుర్తింపు సాధించింది. ఇది మెడ్‌టెక్, టెక్ ఫర్ సోషల్, విజువల్ ఇన్ఫర్మేటిక్స్, డేటా ఇంజనీరింగ్, మెషిన్ లెర్నింగ్, లాంగ్వేజ్ టెక్నాలజీస్, గేమింగ్ అండ్ రోబొటిక్స్ వంటి అభివృద్ధి చెందుతున్న విభాగాలలో డీప్ టెక్ స్టార్టప్‌లకు, నూతన ఆవిష్కరణలకు జీవం పోస్తోంది.

జాగృతి, నవజీవన్ ట్రీలు..

- ట్రిపుల్ ఐటీలో జాగృతి, నవజీవన్ ఇవి రెండూ చెట్ల పేర్లు . 2002 సెప్టెంబర్2న ట్రిపుల్‌ఐటీ ముందున్న రోడ్డు విస్తరణలో తొలగించే రెండు మర్రి చెట్లను ట్రాన్స్ లొకేషన్‌తో క్యాంపస్‌లోకి మార్చారు. ఒకదాన్ని పరిపాలనా భవనం పక్కన నాటి 'జాగృతి' అని మరో దాన్ని నీలగిరి భవన్ వద్ద నాటి దానికి 'నవజీవన్' అని ప్రత్యేకంగా నామకరణం చేశారు.
- అనంతరం నీలగిరి భవన విస్తరణలో నవజీవన్‌ను మళ్ళీ ట్రాన్స్‌లొకేషన్ ద్వారానే పలాష్ నివాస్ సర్కిల్ వద్దకు తరలించి పెంచుతున్నారు.
- ట్రిపుల్‌ఐటీ లోగోను కూడా మర్రిచెట్టుగా ఆకృతిలో తీర్చిదిద్దడం విశేషం

ట్రిపుల్‌ఐటీలో నిర్వహించే కోర్సులివే..

- ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌లో అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులు, డ్యూయల్ డిగ్రీలలో అయిదేళ్ల కోర్సులు
- పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సులు, ఎంఫిల్ సీఎల్, పీహెచ్‌డీ కోర్సులు, పార్ట్ టైమ్ ప్రోగ్రామ్స్ అండ్ పీజీ స్టూడెంట్ స్టేటస్ ప్రోగ్రామ్ (పీజీఎస్‌ఎస్‌పీ) కోర్సులు నిర్వహిస్తారు.

నెదర్లాండ్స్ యూనివర్సిటీలో పత్ర సమర్పణ



నెదర్లాండ్ యూనివర్సిటీ ప్రతినిధులతో పరిశోధక విద్యార్థిని పి.బి.వైష్ణవి

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థిని నెదర్లాండ్స్‌లోని యుట్రెక్ట్ విశ్వవిద్యాలయంలో పత్రసమర్పణ చేశారు.హెచ్‌సీయూలోని సరోజినినాయుడు స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కమ్యూనికేషన్‌లోని డ్యాన్స్ విభాగానికి చెందిన పరిశోధక విద్యార్థిని పి.బి.వైష్ణవి డాక్టోరల్ కన్సార్టియంలో 'ట్రేసింగ్ ది డైనమిక్స్ ఆఫ్ మూవ్‌మెంట్ : ఇన్‌సైట్స్ ఫ్రమ్ ఇండియన్ టెక్స్టువల్ సోర్సెస్' వ్యాసం సమర్పించారు. ఆమె హెచ్‌సీయూలోని ప్రొఫెసర్ జే అనురాధ పర్యవేక్షణలో పనిచేస్తున్నారు.

అన్నపూర్ణాదేవికి పసుపుకొమ్ములతో అలంకారం



రాయదుర్గం: పసుపుకొమ్ములతో అన్నపూర్ణాదేవి అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక అలంకారం చేశారు. వారాహి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 21 కిలోల పసుపు కొమ్ములను దండలుగా అల్లి అమ్మవారికి అలంకరించారు. అంతకుముందు ఆలయంలో అమ్మవారితో పాటు, షిర్డీసాయిబాబా, గణపతి, కాశీ విశ్వేశ్వరస్వామి, ధన్వంతరిస్వామి, ఆంజనేయస్వామికి అర్చనలు, అభిషేకాలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమాలు ఆలయ మేనేజింగ్ ట్రస్టీ వాసిరెడ్డి పార్వతి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలి

- జిల్లా కలెక్టర్ క్రాంతి
- ఇస్నాపూర్ సాంఘిక సంక్షేమ గురుకుల హాస్టల్ ఆకస్మిక తనిఖీ



ఇస్నాపూర్ సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో వంటగదిని పరిశీలిస్తున్న కలెక్టర్ క్రాంతి

పటాన్‌చెరు టౌన్: విద్యార్థి దశలో కష్టపడి చదివితేనే మంచి భవిష్యత్ ఉంటుందని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. శుక్రవారం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల హాస్టల్‌ను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. కిచెన్‌షెడ్ ,స్టోర్ రూమ్, భోజనశాలను ఆమె పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని పాఠశాల సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులతో ఆమె మాట్లాడారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు కష్టపడి చదవాలని సూచించారు. అనంతరం పాఠశాలలో రెజ్లింగ్ శిక్షణను పరిశీలించారు. విద్యార్థులు ఇప్పటివరకు 11 సార్లు రెజ్లింగ్ స్టేట్ ఛాంపియన్‌షిప్, రెండుసార్లు నేషనల్ మెడల్స్ పొందినట్లు పాఠశాల రెజ్లింగ్ కోచ్ ప్రియాంక కలెక్టర్‌కు తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి దేవుజ, తహసీల్దార్ రంగారావు, కళాశాల ఆర్సీఓ భీమయ్య, ప్రిన్సిపల్ యోగేందర్, వైస్ ప్రిన్సిపల్ నాగేశ్వరరావు, ఎంపీడీఓ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ అండర్-14 విజేత కేవీ గచ్చిబౌలి



కబడ్డీ అండర్-14లో బంగారు పతకం సాధించిన కేవీ విద్యార్థినులు

రాయదుర్గం: చదువుతోపాటు క్రీడల్లో కూడా విద్యార్థులు రాణించేలా ప్రోత్సహిస్తున్నామని కేంద్రీయ విద్యాలయ గచ్చిబౌలి ప్రిన్సిపల్ జితేందర్‌కుమార్ పేర్కొన్నారు. కేంద్రీయ విద్యాలయ ప్రాంతీయ స్థాయిలో గెలుపొందిన జట్లకు, క్రీడాకారులకు శుక్రవారం సర్టిఫికెట్లు, మెడల్స్, ట్రోఫీలను ఆయన అందజేశారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ సంజుకుమారి, క్రీడాకారులను ఆయన అభినందించారు. కేంద్రీయ విద్యాలయ ప్రాంతీయస్థాయి పోటీలలో కబడ్డీ విభాగంలో అండర్-14 బాలికల జట్టు గోల్డ్ మెడల్ సాధించింది. కబడ్డీ అండర్ -14 బాలుర జట్టు కెవిఎస్ రీజనల్ స్థాయిలో ప్రథమస్థానంలో నిలిచి బంగారు పతకాన్ని సాధించారు. ఈ రెండు జట్లు జాతీయ స్థాయికి ఎంపికయ్యాయి. కాగా కబడ్డీ అండర్-17 బాలికల కేవీఎస్ రీజనల్ స్థాయిలో రెండవ స్థానంలో నిలిచింది. ముగ్గురు బాలికలు టి నందిక, మోడీకీర్తన, రమ్యకృష్ణలు కేంద్రీయ విద్యాలయ సమితి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

ఉచిత వైద్య శిబిరం

జిన్నారం(పటాన్‌చెరు): వర్షాకాలం నేపథ్యంలో ప్రతి ఒక్కరు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని బొల్లారం మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి ప్రజలకు సూచించారు. శుక్రవారం బొల్లారం మున్సిపల్ పరిధిలోని కాలనీల్లో ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు ఉచిత వైద్యశిబిరాలను ఏర్పాటు చేశారు. ఈ శిబిరాలను మున్సిపల్ చైర్పర్సన్ రోజారాణి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు.

స్నేహితుల మధ్య గొడవ.. చికిత్స పొందుతూ యువకుడు మృతి

దాడి చేసిన యువకుడికి రిమాండ్

మియాపూర్: మద్యంమత్తులో ఇద్దరు స్నేహితులు గొడవపడిన ఘటనలో కొట్టి చంపిన యువకుడిని మియాపూర్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ జగదీష్ తెలిపిన వివరాల ప్రకారం... ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన అరవింద్‌సింగ్(21), మాన్‌సింగ్(21) ఇద్దరు స్నేహితులు. మియాపూర్‌లోని కల్వరిటెంపుల్ రోడ్డులోని లేబర్ క్యాంపు వద్ద నివాసముంటూ భవన నిర్మాణ పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. ఇరువురు తరచూ గొడవపడుతుండేవారు. ఈ నెల 8వ తేదీ ఇద్దరు మద్యం సేవించి మద్యం మత్తులో గొడవపడ్డారు. అరవింద్ సింగ్ తన చేతి కడియంతో మాన్‌సింగ్ ముక్కు, తలపై గట్టిగా కొట్టాడు.దీంతో మాన్‌సింగ్ స్పృహ కోల్పోయి కిందపడిపోయాడు. వెంటనే స్థానికులు దగ్గర్లో ఉన్న ఆసుపత్రికి తరలించగా అక్కడి నుండి మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం రాత్రి 7 గంటలకు మృతి చెందాడు. మృతి చెందిన మాన్‌సింగ్ మేనమామ మితున్‌సింగ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు. ఈ క్రమంలో అరవింద్‌సింగ్‌ను విచారించి అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హఫీజ్‌పేట్: వేమనకాలనీ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

- సురక్ష కాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు విద్యానగర్, సురక్ష కాలనీ, రాజేంద్రరెడ్డి కాలనీ, సత్య ఎన్‌క్లేవ్, పద్మజ కాలనీ, అపర్ణహిల్ పార్కు తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమం సాగుతుంది. ఈ సందర్భంగా 'ఎంపవరింగ్ స్టోరీ ఆఫ్ జగదాంబ సరస్వతి' అనే అంశంపై మౌంట్ అబూకు చెందిన ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, సీనియర్ రాజయోగి బికె రాజుబాయ్ ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040-23001234లో సంప్రదించవచ్చు.

సీఎంఆర్‌ఎఫ్ మంజూరుపత్రం అందజేత



కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

హఫీజ్‌పేట్: హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని సాయినగర్‌కి చెందిన మహ్మద్ అబ్దుల్ జాఫర్‌కు అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం మంజూరైన సీఎం సహాయనిధి రూ.1.50 లక్షలు మంజూరుపత్రాలను బాధిత కుటుంబ సభ్యులకు శుక్రవారం ఎమ్మెల్యే గాంధీ అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు సంజీవరెడ్డి, శ్రీనివాస్ యాదవ్, పోతుల రాజేందర్, నాయకులు కాశినాథ్ యాదవ్, జోగిపేట భాస్కర్, గుడ్ల ధనలక్ష్మి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికను అభివృద్ధి చేయండి

సీపీఎం నాయకుల వినతి

కూకట్‌పల్లి: హైదర్‌నగర్ బస్తీలోని ఆలీతలాబ్ వద్ద ఉన్న హిందూ శ్మశానవాటికలో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ కూకట్‌పల్లి మున్సిపల్ జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌కు కూకట్‌పల్లి సీపీఎం మండల కమిటీ నాయకులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందూ శ్మశానవాటికలో వీధిలైట్లు, స్నానాల గదులు నిర్మించాలని కోరారు. సమస్యలపై స్పందించిన జెడ్‌సి అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఎం. శంకర్, బి. శ్రీను, మహేష్, అశోక్ యాదవ్, వెంకటేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

పటాన్‌చెరు టౌన్: సైబర్ నేరాలపై విద్యార్థులకు సైబర్ క్రైమ్ సీఐ రవికుమార్ అవగాహన కల్పించారు. శుక్రవారం పటాన్‌చెరు పట్టణంలోని ఆర్ జిన్ స్కూల్లో ఆయన మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా తీసుకోవాల్సిన నియమాలు ,సైబర్ నేరగాళ్లను ఎలా గుర్తించాలి అనే అంశాలపై విద్యార్థులకు వివరించారు.అదే విధంగా విద్యార్థులు తల్లిదండ్రులకు తాము తెలుసుకున్న విషయాలను చెప్పాలన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు సోషల్ మీడియా ఎక్కువ వాడతారని, సైబర్ నేరగాళ్లు సోషల్ మీడియా వేదికగా యువతను టార్గెట్ చేసుకొని నేరాలకు పాల్పడుతున్నారని తెలిపారు. అపరిచిత వ్యక్తి నుండి వచ్చే రిక్వెస్ట్ లను గుడ్డిగా నమ్మొద్దని, సోషల్ మీడియాలో పెట్టిన పోస్టులను నమ్మకూడదన్నారు ఏదైనా సైబర్ క్రైమ్ జరిగిన వెంటనే 1930కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని, అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్ లో ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ జగదీష్, కానిస్టేబుల్ సతీష్ పాల్గొన్నారు.

నేడు ఏఐఎఫ్‌డీవై రాష్ట్ర కమిటీ సమావేశం

మియాపూర్: అఖిల భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (ఏఐఎఫ్‌డీవై) రాష్ట్ర కమిటీ సమావేశం మియాపూర్ స్టాలిన్‌నగర్‌లో శనివారం జరగనుందని గ్రేటర్ హైదరాబాద్ కన్వీనర్ డి.మధుసూదన్ ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి రాష్ట్ర నాయకులు పెద్దరపు రమేష్, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కర్ర రాజిరెడ్డి, వనం సుధాకర్‌లతో పాటు గ్రేటర్ హైదరాబాద్, రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి ప్రతినిధులు హాజరు అవుతున్నారని సమావేశంలో భవిష్యత్ కార్యక్రమాలు రూపొందించనున్నామని తెలిపారు.

ఉపాధ్యాయులకు వీడ్కోలు సత్కారం



ఉపాధ్యాయులను సత్కరించిన పాఠశాల సిబ్బంది

రాయదుర్గం: రాయదుర్గం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవలి కాలంలో 9 మంది ఉపాధ్యాయులు బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో శుక్రవారం పాఠశాల ఆవరణలో వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు తాజ్‌బాబు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత కృష్ణగౌడ్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయులు రాజేశ్వరి, కమలమ్మ, గంగ్యానాయక్, ఆంజనేయులు, అంబర్‌సింగ్, ఆనందం, ప్రశాంత్, పాండు, సత్యనారాయణలను ఘనంగా సత్కరించారు.

ఆరోగ్యంపట్ల శ్రద్ధ చూపాలి

పటాన్‌చెరు: ఆరోగ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ అవసరమని జిల్లా మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త పల్లవి అన్నారు. శుక్రవారం జిల్లా శిశు సంక్షేమ శాఖ మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో మిషన్ శక్తి 100 రోజుల ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో భాగంగా పటాన్‌చెరు మండలం ముత్తంగి, రామచంద్రాపురం మండలం వెలిమెల అంగన్‌వాడీ సెంటర్లలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

స్వదేశీ వస్త్ర ప్రదర్శన

ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 7.30 గంటల వరకు







మాదాపూర్: మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో ఏర్పాటు చేసిన స్వదేశీ వస్త్ర ప్రదర్శన సందర్శకులను ఆకట్టుకుంటుంది. కోల్‌కత్తా, వెస్ట్ బెంగాల్, బిహార్, రాజస్థాన్, అహ్మదాబాద్, గుజరాత్, నదియా తదితర ప్రాంతాల చేనేత ఉత్పత్తులను ప్రదర్శనలో ఉంచారు. పట్టుచీరలు, సిల్క్‌చీరలు, దుపట్టాలు, డ్రెస్ మెటీరియల్స్, అందుబాటులో ఉంచారు. బెంగుళూరికి చెందిన కళాకారులు మట్టితో తయారు చేసిన కమ్మలు, హారాలు రూ. 100 నుండి రూ.3500 వరకు అందుబాటులో ఉన్నాయి. యువత వీటిని విరివిగా కొనుగోలు చేస్తున్నారు. జ్యూట్, కాటన్‌తో తయారు చేసిన రకరకాల బ్యాగులు ఉన్నాయి. వీటి ధర రూ. 200 నుంచి 2వేల వరకు ఉన్నాయి. కాగా ఈ ప్రదర్శన 14వ తేదీ వరకు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

పెయింటింగ్‌లు ప్రత్యేకం



పటచిత్ర పెయింటింగ్‌లు వేయడానికి కనీసం 30 రోజులు పడుతుంది. ఒక్కోచిత్రానికి ఒక్కో ప్రత్యేకత ఉంటుంది. వినియోగదారులకు కావాల్సిన చిత్రాలను ఆర్డర్‌పై వేసి ఇస్తాము. ఎక్కువగా దేవతామూర్తుల చిత్రాలు అమ్ముడుపోతాయి. గృహాలంకరణ కోసం మరిన్నీ మోడరన్ చిత్రాలను అందుబాటులో ఉంచాము. – గణేశ్, కళాకారుడు

డిజైన్స్ బాగున్నాయి..



వస్త్రప్రదర్శనలో ఏర్పాటు చేసిన డిజైన్స్ యువతను సైతం ఆకట్టుకుంటున్నాయి. అన్ని వయస్సుల వారికి తగ్గట్టుగా ఉత్పత్తులు ఉన్నాయి. ప్రత్యేక డిజైన్‌లు కావాల్సిన వారికి ఆర్డర్‌పై అందిస్తున్నారు.
– డాక్టర్ కె.లక్ష్మి, ఆర్ట్‌గ్యాలరీ డైరెక్టర్